చిన్నకథ

# దాగుడు మూతలు

విశాఖ పట్నంలో ఉన్న మా అమ్మాయి ఇంటికి నేనూ, శ్రీమతి వచ్చాము, మనవల్ని చూడాలన్న భ్రమతో. అనుబంధాలు లేకపోతే మనిషి ఏమై పోతాడోనని నేను చాలా సార్లు అనుకుంటూ వుంటాను.

మేము ఇంట్లో ప్రవేశించిన కొంత సేపటికి మా అమ్మాయి వచ్చి ''మా మేడపైకి కొత్తగా వచ్చారు. ఆమెకు కథలంటే చాలా ఇష్టం. మీ నాన్నగారు కథలు రాస్తారు గదా, ఆయన వస్తే నాకు చెప్పండి. ఆయనతో చాలా విషయాలు మాట్లాడాలి అంది'' అన్నది.

నేను వెంటనే ''ఈ హైటెక్ యుగంలో కథలు ఇష్టపడే ఆ పిచ్చితల్లి ఎవరే బాబూ. చెప్పు నేను వచ్చానని'' అన్నాను.

సెల్‌ఫోన్లు వచ్చేక మనుషులు చాలా బద్ధకస్తులై పోయారు. మా అమ్మాయి వెంటనే సెల్ తీసుకుని మేడమీదకు రింగ్ చేసింది, లేదంటే పైకి వెళ్లి చెప్పాలిగా.

ఎనభై సంవత్సరాలు దగ్గర పడుతున్నా సరే, ప్రతి చిన్న పెద్ద పత్రికలకు రచనలు రాసి పంపడమూ, ప్రారంభించబోయే పత్రికలకు సందేశాలు పంపడమూ, రచనలు చదివి అభిప్రాయం రాయడమూ, మిత్రుల పుస్తకాలకు సమీక్షలు రాయడమూ, పైగా పత్రికలు తరచూ నిర్వహించే కథల, నవలల పోటీలకు ప్రత్యేకంగా రచన చేసి బహుమతి పొందడం లేదా సాధారణ ప్రచురణకు ఆ రచనల ఎంపిక కావడం జరుగుతూనే వుంది. ఈ వయసులో ఈ పిచ్చిమేళం ఎందుకని మా ఆవిడ పోరుతున్నాసరే, మేలు కాపీ చేయడానికి చేతివేళ్లు నొప్పి పెడుతుంటే, మా అబ్బాయి చేత సిస్టమ్ కొనిపించుకుని, తెలుగు టైపింగ్ నేర్చుకుని, ప్రింటింగ్ చేసి రచనలు పంపడం కూడా మొదలు పెట్టాను.

నేను చాలాసార్లు మిత్రులతో అంటూ వుంటాను. పొగతాగడం, మందు పుచ్చుకోవడం లాంటిదే రచనలు చేయడం అనే వ్యసనం. ఒకసారి అందులోకి దిగితే మానలేము.

ఇంతలో ''నమస్తే అంకుల్. మీరు కథలు రాస్తారట కదా. వండర్‌ఫుల్. ఇన్నాళ్లకు ఒక రచయితను చూడగలిగాను ప్రత్యక్షంగా'' అంటూ సుమారు ముప్పై సంవత్సరాల వయసున్న యువతి వచ్చింది. ఆమె ముఖంలో రచయితను చూశానన్న సంతోషం కాంతి రూపంలో ప్రస్ఫుటంగా కనపడుతూంది.

''సర్..మీకు సూర్యశ్రీగారు తెలుసా? ఆమె చిన్న కథలు మినీ కథలు భలేగా రాస్తారు. దాదాపు నా పదో క్లాసునుంచీ చదువుతున్నాను ఆమె రచనలు. పోయిన సంవత్సరంనుంచే



ఆమె రచనలు పత్రికలలో కనపడడం లేదు. నిజంగా చిన్నకథ అయినా ఎంత సస్పెన్స్‌తో, వర్ణనలతో రాస్తారనుకున్నారు. ఈ మధ్యన ఆమె ఏమై పోయారో తెలియదు. పాపం చనిపోయారేమో'' అంటూ బాధపడసాగింది.

''అంత బాగుంటాయామ్మా ఆమె రచనలు. ఆమె నాకు తెలుసులే. కాని ఆమె చనిపోలేదు.'' అన్నానో లేదో..

''ఆమె ఏ వూళ్లో వుంటారు. మీకు తెలుసునా. ఆమె యడ్రస్సు ఫోన్ నెంబర్ ఇవ్వరూ. ఆమెను కలవాలి'' అంటూ నన్ను తొందర పెట్టసాగింది. ఆమె ముఖంలో తన అభిమాన రచయిత్రిని చూడాలన్న ఆతురత కనపడుతూంది. నా గురించి, నా రచనల గురించి ఆమె ప్రశ్నించక పోవడం ఇక్కడ ప్రస్తావించాలి. అయినా నేను ''సాయంత్రం ఆమె యడ్రస్సు మా అమ్మాయికి ఇస్తాను. తప్పకుండా ఆమెతో మాట్లాడు'' అంటూండగానే ఆ అమ్మాయి లోపలకు వెళ్లిపోయింది మా అమ్మాయితో మాట్లాడటానికి.

'రచనలు చేయడం మీ ప్రవృత్తి అయితే రాయడం మాత్రం మానేయకండి. నిరంతరం రాస్తూనే వుండండి' అని అనేకమంది రచయితలు అంటూ వుంటారు. దాదాపు నలభై సంవత్సరాల నుండి రచనలు చేస్తున్న నేను, ఒక సంవత్సరంనుండి అనివార్య కారణాల వలన రచనలు చేయలేక పోయి, గ్యాప్‌ను కవర్‌చేసుకోడానికి మరల ఒక సంవత్సరంనుండి రాస్తున్నాను.

ఇంతలో మా అమ్మాయితో చెప్పి ఆమె వెళ్లి పోయింది. ''అదేంటి నాన్నగారూ 'సూర్యశ్రీ' అంటే మీరే కదా. చెప్పలేదేం ఆమెకు. మీరు చెప్పలేదని, నేనూ నవ్వుతూ తల వూపేను'' అంది నన్ను ఏదోలా చూస్తూ.

''నేనే సూర్యశ్రీ కలం పేరుతో రచనలు చేస్తున్న సంగతి, నేను బతికే ఉన్నానన్నమాట, ఆమెకు చెప్పి, ఆమె మనసులో ఉన్న ఆసక్తి, ఆకర్షణ, మోజు ఒక్కసారిగా తగ్గించి ఆమెను నిరుత్సాహపరచడం ఇష్టం లేదులే'' అన్నాను.

రచయిత తన ఫొటో పత్రికలలో ప్రచురించుకోకపోవడం పాఠకులలో తనంటే ఉన్న క్రేజ్, మితిమీరిన అభిమానం సజీవంగా ఉండటానికి దోహదపడతాయని నా నమ్మకం.

– కె.బి. కృష్ణ